సాక్షి రాజన్న సిరిసిల్ల

మంగళవారం | 31 | జనవరి | 2023



భూమి పూజ

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని 30వ వార్డులో పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ సోమవారం భూమి పూజ చేశారు. 2వ వార్డులో కంటివెలుగును ప్రారంభించారు.



ఎస్పీని కలిసిన కమాండెంట్

సిరిసిల్లక్రైం: ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అఖిల్ మహాజన్‌ను సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కె.సుబ్రమణ్యం సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

గరిష్టం/కనిష్టం
31.0/19.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వేములవాడ ఆస్పత్రిలో కంటి ఆపరేషన్లు



వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆస్పత్రిలో ఒకే రోజు ఏడు కంటి ఆపరేషన్లు విజయవంతంగా చేసినట్లు సూపరింటెండెంట్ రేగులపాటి మహేశ్‌రావు తెలిపారు. కంటి పై పొరతో బాధపడుతూ చూపు మందగిస్తుండడంతో పరీక్షించిన వైద్యులు ఆపరేషన్‌కు నిర్ణయించారు. చందుర్తి మండలం మల్యాలకు చెందిన శ్రీదేవి, రాములు, వేములవాడకు చెందిన సత్తెమ్మ, మామిడిపల్లికి చెందిన దేవయ్య, నర్సయ్య, జోగాపూర్‌కు చెందిన లచ్చవ్వ, సిరికొండకు చెందిన రామయ్యలకు కంటి పొరను తొలగించి లెన్స్‌ను అమర్చి శస్త్రచికిత్సలు విజయవంతం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రి సేవలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు వెంకట్, కంటివైద్యులు ఖాదర్, రత్నమాల, రాజేందర్, నర్సింగం ఉన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ



ఇల్లంతకుంట(మానకొండూరు): జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగంగా స్పర్శ్ కుష్ఠువ్యాధి అవగాహన ప్రచార కార్యక్రమాన్ని ఫిబ్రవరి 13 వరకు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు పేర్కొన్నారు. ఇల్లంతకుంటలోని రైతువేదిక వద్ద వైద్యసిబ్బంది, ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, వైద్యాధికారులు శరణ్య, రమేశ్, సూపర్‌వైజర్ నయీం, హెచ్‌ఈవో ఖుద్దూస్ పాల్గొన్నారు.

గడువు మీరిన కూల్‌డ్రింక్స్ స్వాధీనం



ముస్తాబాద్(సిరిసిల్ల): గడువు మీరిన కూల్‌డ్రింక్స్ విక్రయిస్తున్న మండల కేంద్రంలోని ఓ బేకరీ యాజమాన్యంపై పంచాయతీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల వచ్చిన ఫిర్యాదులతో పంచాయతీ కార్యదర్శి రాజు నేతృత్వంలో సోమవారం దుకాణాలపై దాడులు చేశారు. పంచాయతీ కార్యదర్శి రాజు మాట్లాడుతూ మండల కేంద్రంలోని గోల్డెన్ బేకరీలో డిసెంబర్‌లోనే ఎక్స్‌పైరీ తేదీ ముగిసిన కూల్‌డ్రింక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బేకరీ యాజమాన్యానికి నోటీసులు జారీ చేయడంతోపాటు రూ.5వేలు జరిమానా విధించినట్లు వివరించారు. పంచాయతీ అధికారులు భిక్షపతి, నరేశ్, రాజు, రవి పాల్గొన్నారు.

డ్రోన్ తయారీపై అవగాహన



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం అదే పాఠశాల పూర్వ విద్యార్థి బీమరి శ్యామ్ డ్రోన్ తయారీపై అవగాహన కల్పించారు. డ్రోన్ తయారీ, పనిచేసే విధానం వివరించారు. శ్యామ్ తయారీ చేసిన డ్రోన్‌ను ప్రదర్శించారు. హెచ్‌ఎం రామారావు, ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థి భీమరి శ్యామ్‌ను అభినందించారు.

పట్టాలు ఇవ్వాలి



సిరిసిల్లటౌన్: ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని మర్రిమడ్లకు చెందిన పలువురు రైతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడుతూ గ్రామానికి చెందిన దళితులు సర్వేనంబర్ 102, 104లలో 80 ఎకరాలను గత నలభై ఏళ్లుగా సాగుచేసుకుంటున్నారన్నారు. ఇప్పుడు పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఏవో గంగయ్యకు వినతిపత్రం అందజేశారు.



రాజన్నను దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు



కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను సోమవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన అనంతరం కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణ, జాతరగ్రౌండ్, అనుబంధ ఆలయాలు రద్దీగా మారాయి.



ఒర్రె దాటేదెలా?

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలం మామిడిపల్లి–చందుర్తి మండలం ఎన్గల్ గ్రామాలు పక్కపక్కనే ఉంటాయి. ఆ రెండు గ్రామాల మధ్య రవాణాకు నక్కవాగు అడ్డుగా మారింది. ఒర్రెలో నీరు పారుతుండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఒర్రెపై కాజ్‌వే నిర్మించాలని ఆ రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కంటి సమస్యల పరిష్కారమే లక్ష్యం

- వీర్నపల్లిలో కంటివెలుగు శిబిరం సందర్శన
- మృతుల కుటుంబాలకు పరామర్శ
- తంగళ్లపల్లిలో ఎల్లమ్మ సిద్ధోగానికి హాజరు



బాలయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి



వీర్నపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి/తంగళ్లపల్లి (సిరిసిల్ల): రాష్ట్రంలో కంటి సమస్యలతో బాధపడే వారికి శాశ్వత పరిష్కారాన్ని చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో కంటివెలుగు శిబిరాన్ని సోమవారం సందర్శించారు. కంటిపరీక్షలు చేయించుకుంటున్న వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. కంటి పరీక్షలపై ఆరాతీశారు. ప్రజల నుంచి స్పందనపై ఆరా తీశారు. కంటివెలుగు శిబిరాలు వృద్ధులకు బాగా అక్కరకు వస్తుందని సిబ్బంది వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి కంటి వెలుగును విజయవంతం చేయాలని కేటీఆర్ సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, టీఎస్‌టీపీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, ×సెస్‌× చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, క్రీడల శాఖ అధికారి ఉపేందర్ రావు, తంగళ్లపల్లి సర్పంచ్ అంకారపు అనిత, ఎంపీటీసీ కోడి అంతయ్య, వీర్నపల్లి ఎంపీపీ మాలోత్ భూల, జెడ్పీటీసీ కళావతి, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం పాల్గొన్నారు.

- రాజన్న ప్రీమియం లీగ్–2023 లోగోను మంత్రి కేటీఆర్ వీర్నపల్లి రైతువేదికలో ఆవిష్కరించారు. వాలీబాల్, కబడ్డీ పోటీలను జిల్లాలో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.
- గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకొని వీర్నపల్లి రైతు వేదికలో మహాత్మాగాంధీ చిత్రపటానికి మంత్రి కేటీఆర్ పూలమాల వేసి నివాళి అర్పించారు.
- వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లి ఎంపీటీసీ ఈసంపల్లి హేమ భర్త దేవేందర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా వారి కుటుంబాన్ని మంత్రి కేటీఆర్ పరామర్శించారు. హేమకు ఇద్దరు ఆడపిల్లలు కాగా వారి పేరిట రూ.5లక్షలు డిపాజిట్ చేస్తానని హామీ ఇచ్చారు. ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు గొల్లపల్లి కిషన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.
- ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి సర్పంచ్ కనకట్ల బాలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. పోతిరెడ్డిపల్లెలో బాలయ్య కుమారులు మహేందర్, శ్రీనివాసులను సోమవారం పరామర్శించారు. బాలయ్యతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మారుమూల అటవీ ప్రాంతమైన పోతిరెడ్డిపల్లెకు తారు రోడ్డు నిర్మాణంతోపాటు పలు అభివృద్ధి పనులకు సర్పంచ్‌గా బాలయ్య ఎంతో కృషి చేశారన్నారు. ఎల్లారెడ్డిపేట ఎంపీపీ రేణుక, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీ తిరుపతి, సుభాష్, నర్సింహారెడ్డి, సుధాకర్‌రావు, ప్రభాకర్ ఉన్నారు.
- తంగళ్లపల్లి మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం నూతన భవనం నిర్మాణానికి భూమిపూజ చేశారు. మానేరు నదీ తీరాన కొలువైన ఎల్లమ్మ సిద్ధోగానికి హాజరయ్యారు. నూతనంగా నిర్మించిన ఎల్లమ్మతల్లి ఆలయాన్ని ఎంపీపీ మానస, జెడ్పీటీసీ మంజులతో కలిసి ప్రారంభించారు. ట్రైబల్ డిగ్రీ కాలేజీలో ఫైన్ ఆర్ట్స్ చదువుతున్న విద్యార్థినులతో ముచ్చటించారు.

ప్రజావాణి సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- 29 అర్జీలు స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లఅర్బన్: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మొత్తం 29 దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, ఇన్‌చార్జి డీఆర్‌వో శ్రీనివాస్‌రావు అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేత

తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లికి చెందిన దివ్యాంగుడు రాయల్ల ఆనందం వీల్‌చైర్ మంజూరు చేయాలని ప్రజావాణిలో కలెక్టర్ అనురాగ్ జయంతిని కోరారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే వీల్‌చైర్ మంజూరు చేయాలని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేశారు.

పాడిరైతులకు అండగా ప్రభుత్వం..

- చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్



మందులు అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి(చొప్పదండి): పాడిపరిశ్రమతో ఉపాధి పొందే రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని మర్లపేటలో బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతోపాటు పాడిపరిశ్రమతో ఉపాధి పొందాలన్నారు. కాగా మార్కెట్ కమిటీ సహకారంతో శిబిరంలో 230 పశువులకు గర్భకోశ సంబంధ, సాధారణ చికిత్సలు చేసి ఉచితంగా మందులు అందించినట్లు పశువైద్యాధికారి రమేశ్ తెలిపారు.

ఆడబిడ్డలకు సర్కారు కానుక కల్యాణలక్ష్మి

నిరుపేద ఆడబిడ్డల వివాహాలకు కల్యాణలక్ష్మి పథకం సీఎం కేసీఆర్ ఇచ్చే కానుకగా చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని వరదవెల్లి, కొత్తపేట, మాన్వాడ, మల్లాపూర్ గ్రామాల్లో 17 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ డైరెక్టర్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, సెస్‌డైరెక్టర్ కొట్టిపెల్లి సుధాకర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అజ్జు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఏఎంసీ కార్యదర్శి హరనాథ్, గుడ్ల శ్రీనివాస్, సాయిరెడ్డి, ఎంపీటీసీ ఐరెడ్డి గీత ఉన్నారు.

ఇన్‌చార్జి చైర్మన్‌గా శ్రీనివాస్

- జగిత్యాల మున్సిపల్ ఉత్కంఠకు తెర
- భోగ శ్రావణి రాజీనామా ఆమోదం
- వైస్‌చైర్మన్‌కే ఇన్‌చార్జి బాధ్యతలు
- బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ రవి



శ్రీనివాస్‌కు నియామకపత్రం అందిస్తున్న కమిషనర్

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా వ్యవహారంలో ఇన్ని రోజులు కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. రాజీనామా ఆమోదం అవుతుందా.. లేదంటే రాజీకి వెళ్తారా అనే అనుమానాలకు ఫుల్‌స్టాప్ పడింది. చైర్‌పర్సన్ భోగ శ్రావణితో చర్చించిన కలెక్టర్ రవి.. ఎట్టకేలకు రాజీనామాను ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు.

కలెక్టర్ కార్యాలయానికి పిలిచి..

- సెలవులు ముగియడంతో సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు కార్యాలయానికి చైర్‌పర్సన్ భోగ శ్రావణిని కలెక్టర్ రవి పిలిచారు. 'ఈ లేఖ మీరే రాశారా? ఫోర్జరీ ద్వారా వచ్చిందా? రాజీనామా ఎందుకు చేశారు? అనే విషయాలు తెలుసుకున్నారు. ఆమె స్పందిస్తూ.. 'నా ఇష్టపూర్వకంగానే రాజీనామా చేశానని, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వేధింపుల వల్లేనని' పేర్కొన్నారు. దీంతో ఆ విషయాన్ని లేఖ ద్వారా ఇవ్వాలని కలెక్టర్ సూచించగా.. మరోసారి లేఖ రాసిచ్చారు. సాయంత్రం 4 గంటలకు రాజీనామాను ఆమోదించారు.

నాటకీయ పరిణామాల మధ్య..

నెల రోజులుగా జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ విషయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని కౌన్సిలర్లు ఈనెల 21న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు లేఖ ఇచ్చారు. అప్పటి నుంచి అవిశ్వాసం రగులుకుంటూ వచ్చింది. మొత్తం 33 మంది సభ్యులు చైర్‌పర్సన్ ఉండవద్దని మొదటి నుంచి ఏకతాటిపై ఉన్నారు. చివరగా 27 మంది ఎమ్మెల్యేకు లేఖ ఇచ్చారు. తదుపరి ఒక్కొక్కరుగా అవిశ్వాసం కాకుండా చైర్‌పర్సన్‌ను దింపేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ పరిణామాలన్నింటి మధ్య తానే రాజీనామా చేయాలని చైర్‌పర్సన్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఆ పరిణామం అధిష్టానానికి ఇబ్బందికరంగా మారింది. మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణ, పార్టీ అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అందరినీ సమన్వయం చేసి రాజీనామా వెనక్కి తీసుకునేలా ప్రయత్నిద్దామనుకునే లోపే చైర్‌పర్సన్ ప్రెస్‌మీట్ పెట్టి నిర్ణయం వెల్లడించారు. అంతేకాదు ఎమ్మెల్యేపై తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఖచ్చితంగా ఆమెను పదవి నుంచి తొలగించాల్సిందేనని మంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేపై కౌన్సిలర్లు ఒత్తిడి తెచ్చారు. అప్పటికే రాజీనామా లేఖ పంపించినప్పటికీ మూడు రోజుల తర్వాత కలెక్టర్ ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను పదవీ నుంచి తొలగించడంతో విజయం సాధించామని కౌన్సిలర్లు పేర్కొంటున్నారు.

మూడేళ్లకే రాజీనామా..

జగిత్యాల మున్సిపాలిటీగా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆరుగురు చైర్మన్లుగా కొనసాగారు. అందరూ పూర్తిస్థాయిలో ఐదేళ్ల పనిచేశారు. కానీ.. జగిత్యాల చరిత్రలో మొదటిసారి టీఆర్‌ఎస్ పాలకవర్గంలోనే మూడేళ్లకే రాజీనామా చేయడం గమనార్హం.

కొత్త చైర్మన్‌కు అన్ని బాధ్యతలు..

- తెలంగాణ 2009 సెక్షన్ 34 ప్రకారం వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కమిషనర్ బోనగిరి నరేశ్ చైర్మన్ బాధ్యతల ఉత్తర్వు కాపీని అందించారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గోలి శ్రీనివాస్‌కు పూర్తిస్థాయి అధికారం ఉంటుంది. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నుంచి మళ్లీ చైర్మన్ ఎన్నిక కోసం నోటిఫికేషన్ వచ్చేంత వరకు వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్ ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగుతారు. శ్రావణి రాజీనామాకు సంబంధించిన సమాచారాన్ని సైతం స్టేట్ ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

ఆశావహుల హడావుడి..

మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణి రాజీనామా ఆమోదం కావడంతో ఆశావహుల్లో సందడి మొదలైంది. నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గోలి శ్రీనివాస్‌తో అప్పుడే సమావేశమయ్యారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయగానే చైర్‌పర్సన్ ఎన్నిక జరిగే అవకాశం ఉంటుంది. బీసీ మహిళ జనరల్ జగిత్యాల మున్సిపల్‌కు కేటాయించారు. ఇప్పటికే గతంలో చైర్‌పర్సన్ పదవిని ఆశించిన వారిలో సమిండ్ల వాణి, బండారు రజిని ఉండగా, ప్రస్తుతం వారి పేర్లే మళ్లీ వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రాజీనామా చేసిన భోగ శ్రావణి పద్మశాలీ వర్గానికి చెందిన వారు కావడంతో మరో పద్మశాలీ వర్గానికి చెందిన అడువాల జ్యోతికి ఇవ్వాలని ఆ వర్గం వారు కోరుతున్నారు.

శ్రావణి పయనం ఎటు ?

భోగ శ్రావణి మొదటిసారిగా 37వ వార్డు నుంచి గెలుపొందారు. ఆమె మామ భోగ వెంకటేశ్వర్లు టీడీపీ నుంచి కౌన్సిలర్‌గా పనిచేశారు. ఎమ్మెల్సీ రమణ అనుచరుడిగా, గతంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగారు. ఆయన వారసురాలుగా రాజకీయ ఆరంగేట్రం చేసిన శ్రావణి వృత్తిరీత్యా డాక్టర్. కౌన్సిలర్‌గా గెలిచిన ఆమెకు అతిచిన్న వయస్సు(27 ఏళ్లలోనే)లోనే మున్సిపల్ చైర్‌పర్సన్ పదవీ వరించింది. కానీ.. మూడేళ్ల ముచ్చటే అన్నట్లు మిగిలిపోయింది. శ్రావణి కొద్దిరోజుల క్రితం బీజేపీ అగ్ర నాయకులతో మంతనాలు జరిపారనే ఆరోపణలు సైతం వినిపించాయి. త్వరలో బీజేపీలో చేరే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మ రోవైపు బీజేపీ నాయకుల ద్వారానే ఈ తంతంగం జరుగుతోందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉంటారనే వార్తలు వస్తున్నాయి.

చైర్‌పర్సన్ పదవికే రాజీనామా..

కలెక్టర్ పిలిచి మరోసారి వివరణ కోరిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. చైర్‌పర్సన్ పదవికి మాత్రమే రాజీనామా చేశానని, బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణి పేర్కొన్నారు. పదవిలో ఉన్నా ఏమీ చేయలేకపోతున్నామని, ఎమ్మెల్యే వేధింపులు భరించలేకనే వదిలేశానని చెప్పారు. ఉద్యమకారులకు ఇస్తారో, బడా కాంట్రాక్టర్లకు ఇస్తారో చూడాలని ఆమె పేర్కొన్నారు. కలెక్టర్ మరోసారి రాజీనామాపై వివరణ కోరారని, తన ఇష్టపూర్వకంగా రాజీనామా చేసినట్లు ఒప్పుకున్నానని వెల్లడించారు. కౌన్సిలర్‌గా బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని పేర్కొన్నారు.

గోలి శ్రీనివాస్ ప్రొఫైల్

- ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గోలి శ్రీనివాస్ ఆర్యవైశ్యుడు. వయస్సు 51 సంవత్సరాలు. ఇంటర్ వరకు చదువుకున్న శ్రీనివాస్ వ్యాపార రంగంలో కొనసాగుతున్నారు.
- గతంలో కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడిగా కొనసాగారు. 44వ వార్డు కౌన్సిలర్‌గా విజయం సాధించారు.
- ఎప్పుడైనా మైనార్టీలకు దక్కే వైస్‌చైర్మన్ పదవీని శ్రీనివాస్ దక్కించుకున్నారు.
- భోగ శ్రావణి తన పదవీకి రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న గోలి శ్రీనివాస్‌కు చైర్మన్‌గా అవకాశం వచ్చింది.

పట్టణాభివృద్ధికి కృషి చేస్తా

శ్రావణి రాజీనామాతో వైస్‌చైర్మన్‌గా ఉన్న నన్ను చైర్మన్‌గా నియమించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సహకారంతో తోటి కౌన్సిలర్లతో సమన్వయంతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తా. కొత్త చైర్మన్‌ను ఎన్నుకునే వరకు పారిశుద్ధ్యం, ఇతరత్ర పనులపై శ్రద్ధ చూపి పట్టణాభివృద్ధిలో పాలుపంచుకుంటా.
– గోలి శ్రీనివాస్, మున్సిపల్ కొత్త చైర్మన్

గాంధీ సేవలు చిరస్మరణీయం

- ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్లక్రైం: దేశానికి స్వేచ్ఛను ప్రసాదించడంలో గాంధీజీ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం నివాళి అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో ప్రాణాలు అర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మౌనం పాటించారు. ఏఎస్పీ చంద్రయ్య, అడ్మినిస్ట్రేషన్ అధికారి హమ్మదుల్లాఖాన్, సీఐ ఉపేందర్, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భారత్ జోడో యాత్రతో కార్యకర్తల్లో ఉత్సాహం



సిరిసిల్లటౌన్: రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపిందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. యాత్ర ముగింపు సందర్భంగా సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణగౌడ్, పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాలరాజ్, నాయకులు కాముని వనిత, సూర దేవరాజు, మాజీ కౌన్సిలర్ స్వరూప పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాల నిర్మాణం పూర్తి చేయాలి



పాఠశాల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న బీజేవైఎం నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని హరిదాస్‌నగర్‌లో మూడేళ్లుగా నిలిచిన ప్రైమరీ పాఠశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు మేరుగు జితేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. జెడ్పీటీసీ సొంత గ్రామంలో పాఠశాల భవనం మూడేళ్లుగా పూర్తికాకపోవడం సిగ్గుచేటన్నారు. అలాగే జెడ్పీటీసీ అక్రమాలపై లోకాయుక్తలో ఫిర్యాదు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు ఎలేందర్, ప్రకాశ్, సేనతిరెడ్డి, సురేశ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న మేనేజర్ జ్యోతి

వేములవాడరూరల్: ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని గ్రామీణ బ్యాంకు మేనేజర్ జ్యోతి అన్నారు. సోమవారం వేములవాడ మండలం ఫాజుల్‌నగర్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతీ కుటుంబంలో డబ్బులు సంపాదించడమే కాదు వాటిని ఖర్చు కూడా సరైన మార్గంలో చేసుకున్నప్పుడే కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగుంటాయని అన్నారు. వీటిపై అవగాహన చేసుకొని పొదుపుబాటలో పయనించాలని తెలిపారు. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లపై అవగాహన పెంచుకుని పొదుపు చేసే విధానం నేర్చుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో మోసాలు జరుగుతున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేణు, ఫీల్డ్ ఆఫీసర్ నరేశ్, గ్రామస్తులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: నిరుద్యోగ యువతకు ఉపాధినిచ్చే పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించినట్లు రామానంద తీర్థ గ్రామీణ సంస్థ డైరెక్టర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేధ చారిటబుల్ ట్రస్టు సహకారంతో ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణులకు డొమెస్టిక్ ఎలక్ట్రీషియన్, సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ సర్వీస్, కనీసం 8వ తరగతి పాసైన వారికి ఎంబ్రాయిడరీ, జర్దోసి, టైలరింగ్, క్విల్ట్ బ్యాగ్స్ మేకింగ్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల పాతికేళ్ల లోపు యువత తమ విద్యార్హతల జిరాక్స్ పత్రాలు, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రంతో యాదాద్రి భువనగిరి జిల్లా జలాల్‌పూర్‌లోని సంస్థ కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాల కోసం 91339 08000 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వాలు రాజ్యహింసకు పాల్పడుతున్నాయి

- ప్రజాస్వామ్యం కనుమరుగైంది
- ప్రజలు ప్రశ్నించాలి
- జనశక్తి అగ్రనేత అమర్
- వేములవాడలో కూర మల్లమ్మ 4వ వర్ధంతికి హాజరు



కూర మల్లమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న అమర్, విమలక్క తదితరులు

వేములవాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యహింసను కొనసాగిస్తున్నాయని జనశక్తి అగ్రనేత కూర దేవేందర్ అలియాస్ అమర్ పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం కరువైందని, ప్రజలు ప్రశ్నించాల్సిన అవసరమొచ్చిందన్నారు. తన తల్లి కూర మల్లమ్మ 4వ వర్ధంతిని పురస్కరించుకుని వేములవాడలోని తన నివాసంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. మల్లమ్మ చిత్రపటంతోపాటు రంగవల్లి, నర్సింహయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అమర్ మాట్లాడుతూ కామ్రేడ్ కూర రాజన్నకు బెయిల్ వచ్చినట్లు తమకు తెలుస్తున్నా.. కేసులమీద కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెయిల్ ఆర్డర్ కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. మత రాజకీయాలు పెరిగిపోయాయన్నారు. దేశంలో స్వేచ్ఛాయుత వాతావరణం కోసం విప్లవకారులు ఏకం కావాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. అమరులకు జోహార్లు అర్పిస్తూ విమలక్క పాటపాడారు. ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ, గ్రామిక శక్తి రాష్ట్ర నాయకురాలు లక్ష్మి, నాయకులు పోకల సాయి, స్వామిదాసు, యాదగిరి, న్యాయవాదులు నేరెళ్ల తిరుమల్‌గౌడ్, రేగుల దేవేందర్, పోతుల రమేశ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పట్టాలు పంపిణీ చేయాలి

- వీసీలో మంత్రి సత్యవతి రాథోడ్



కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్

సిరిసిల్ల: పోడుభూములకు ఫిబ్రవరిలో పట్టాలు పంపిణీ చేయాలని వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మహిళా, శిశుసంక్షేమం, గిరిజన అభివృద్ధి శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ సూచించారు. హైదరాబాద్ నుంచి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి జిల్లా కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పోడుభూములకు పట్టాలు, కంటివెలుగు-2, 'మన ఊరు - మన బడి', ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, ఆయిల్‌పామ్ సాగుపై సమీక్షించారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానాయక్, జిల్లా ఫారెస్ట్ అధికారి బాలమణి, జెడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి, డీపీవో రవీందర్, డీఈవో రాధాకిషన్, కంటివెలుగు ప్రోగ్రాం అధికారులు శ్రీరాములు, రజనీ, ఉద్యానవన అధికారి జ్యోతి పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

- టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



కంటి వెలుగు శిబిరంలో టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): అంధత్వరహిత రాష్ట్రంగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు కోరారు. గంభీరావుపేట మండలం లింగన్నపేటలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని సోమవారం సందర్శించారు. రవీందర్‌రావు మాట్లాడుతూ ప్రజలు విధిగా కంటిపరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వారికి ప్రభుత్వమే ఉచితంగా అద్దాలు అందిస్తుందని తెలిపారు. ఎంపీపీ వంగ కరుణ, సర్పంచ్ చైతన్య, ఎంపీటీసీ రేణుక, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు అహ్మద్, ఉపసర్పంచ్ దుబాసి రాజు, నాయకులు వంగ సురేందర్‌రెడ్డి, సీహెచ్‌వో రమేశ్, బిళ్ల రాజు పాల్గొన్నారు.

ఎస్పీని సత్కరించిన డీసీసీ ప్రతినిధులు



ఎస్పీ అఖిల్ మహాజన్‌ను సత్కరిస్తున్న ఆది శ్రీనివాస్, నాయకులు

సిరిసిల్ల: జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అఖిల్ మహాజన్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, చొప్పదండి ప్రకాశ్, ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రిమిసంహారక మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య



పోశవ్వ మృతదేహం

వెల్గటూర్: ఎండపల్లి మండలం గొడిశెలపేటలో ఆదివారం కడుపునొప్పి భరించలేక ఓరుగంటి పోశవ్వ(73) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. పోశవ్వ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోందని, ఆస్పత్రిలో చూపించినా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కొడుకు ఓరగంటి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..

కరీంనగర్‌క్రైం: మద్యానికి బానిస కావడంతో పాటు ఆర్థిక ఇబ్బందుల వల్ల ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాలు.. కరీంనగర్ రాంనగర్‌కు చెందిన తుల్ల శ్రీనివాస్(43) మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు డ్రైవర్‌గా పనిచేశాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసై రోజూ మద్యం తాగి ఇంటికి వెళ్లేవాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు కూడా ఉన్నాయి. ఆదివారం మద్యం తాగి రాగా అతడి కుటుంబ సభ్యులు మందలించారు. వారువో ఫంక్షన్‌కు వెళ్తామని, రావాలని అడుగగా రాను అని చెప్పి ఇంట్లోనే ఉన్నాడు. రాత్రి 9.30 గంటలకు కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి బెడ్ రూంలోని ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు 108కు ఫోన్ చేయగా వారు వచ్చి అప్పటికే మృతిచెందాడని తెలిపారు. తన భర్త మద్యానికి బానిసవడంతో పాటు ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని సోమవారం మృతుడి భార్య టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి..

జమ్మికుంట(హుజూరాబాద్): గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంచిర్యాల రైల్వే పోలీసుల వివరాల ప్రకారం..జమ్మికుంట, ఉప్పల్ రైల్వేస్టేషన్ల మధ్య ఏపీ ఎగువ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి 40 ఏళ్ల వయస్సుగల గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వద్ద ఎలాంటి చిరునామా, ఆధారాలు లేవు. ఒంటిపై బ్లూరంగు జీన్స్ ప్యాంట్, తెలుపు రంగు చొక్కా, మెడకు నల్లటి దారంతో ఆంజనేయుని బొమ్మగల మెటల్ లాకెట్, కుడి చేతికి తెలుపు రంగు ఉంగరం, కుడి చేతిపై ఏ అక్షరం పచ్చబొట్టు ఉంది. పై ఆధారాల ద్వారా మృతిచెందిన వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే రైల్వే పోలీసులు, మంచిర్యాల ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ కెంసారపు సంపత్‌కు సమాచారం ఇవ్వాలని, 83285 12176, 94409 00792 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు

అనారోగ్యంతో వ్యవసాయాధికారి మృతి



తిరుపతి(ఫైల్)

సిరిసిల్లఅర్బన్: అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ సిరిసిల్ల మండల వ్యవసాయ అధికారి తిరుపతి(50) సోమవారం మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన తిరుపతి సిరిసిల్ల మండలంలో వ్యవసాయ అధికారిగా 12ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. సంవత్సరం నుంచి అనారోగ్యానికి గురై కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. 20 రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో ఆయన భార్య కిడ్నీని ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. సోమవారం ఆరోగ్యం పూర్తిగా క్షీణించి గుండెపోటుతో మృతి చెందినట్లు సహోచర ఉద్యోగులు తెలిపారు. మృతుడికి భార్య రమ్యజ్యోతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. తిరుపతి మృతికి వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈవోలు, రైతులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



చందుర్తి (వేములవాడ): ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను చందుర్తి మండలం లింగంపేట గ్రామశివారులో సోమవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు చందుర్తి ఎస్సై జిల్లెల్ల రమేశ్ తెలిపారు. ట్రాక్టర్లను సీజ్ చేసి దేవునితండాకు చెందిన బుక్యా సూర్యకిరణ్, మున్నావత్ దేవేందర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

కుష్ఠురహిత సమాజానికి కృషి చేయాలి

సిరిసిల్లఅర్బన్: కుష్ఠు రహిత సమాజానికి కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు కోరారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో సోమవారం జాతీయ కుష్ఠువ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్ రజిత పాల్గొన్నారు.

టిఫిన్ బాగుంది..



టిఫిన్ చేస్తున్న మంత్రి కేటీఆర్

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలం రంగంపేటలోని దళితబంధు పథకంలో భాగంగా ఏర్పాటు చేసుకున్న హోటల్‌లో యజమాని కుమ్మరి దేవయ్య కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి కేటీఆర్ టిఫిన్ చేశారు. టిఫిన్ బాగుందని కితాబునిచ్చారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం వీర్నపల్లి మండలానికి మంత్రి వచ్చారు. ఈసందర్భంగా హోటల్‌ను సందర్శించారు. మంత్రి మాట్లాడుతూ దళితుల అభివృద్ధి కోసమే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎంపీపీ భూల, జెడ్పీటీసీ కళావతి, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం ఉన్నారు.

ఆపదొస్తే అంతే..

- రాజన్న ఆలయ ఆవరణలో మూతబడిన ప్రథమ చికిత్స కేంద్రం
- కంటివెలుగులో సిబ్బంది
- ఇబ్బంది పడుతున్న భక్తులు



మూసి ఉన్న రాజేశ్వరపురం వసతి గదుల్లో ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఆపదలో ఆదుకునే వైద్యం అందుబాటులో లేకుండాపోయింది. కొద్ది రోజులుగా రాజన్న ఆలయ రాజేశ్వరపురం వసతి గదుల్లో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రం మూసివేసి ఉంచుతున్నారు. వారంలో నాలుగు రోజులు మాత్రమే సేవలందించే ఈ కేంద్రం పదిహేను రోజులుగా మూతబడి ఉంటుందని స్థానికులు తెలిపారు. మహాశివరాత్రి జాతర మహోత్సవాలు సమీపిస్తుండడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. ఈక్రమంలో ఆపదొస్తే పరిస్థితులు ఏంటని భక్తులు ఆందోళన చెందుతున్నారు. కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా.. రాజన్న భక్తులకు మాత్రం ప్రథమ చికిత్స అందించే పరిస్థితులు ఆలయ ఆవరణలో కనబడటం లేదు.

బస్తీ దవాఖానాకు సుస్తీ

వేములవాడలో ఏర్పాటు చేసే బస్తీ దవాఖానాకు సుస్తీ వచ్చింది. పనులు ఇంకా ప్రారంభించకపోవడంతో భక్తులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్తీ దవాఖానా ఏర్పాటు కోసం లక్ష్మీగణపతి కాంప్లెక్స్ సముదాయంలోని పాత విజయా బ్యాంకు భవనాన్ని కేటాయించారు. దీన్ని మున్సిపల్ అధికారులు వైద్యశాఖకు అప్పగించాల్సి ఉంది. కానీ ఎలాంటి పనులు చేయలేదు.

కంటివెలుగులో వైద్య సిబ్బంది



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగులో వైద్యసిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. సిబ్బంది కొరతతో రాజన్న గుడి వద్ద ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రాన్ని తెరువడం లేదు. కంటివెలుగు పూర్తికావడంతోనే తిరిగి తీస్తాం. బస్తీ దవాఖానా త్వరగా పూర్తి చేసి తమకు అప్పగిస్తే తప్పకుండా వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచుతాం. – డాక్టర్ సుమన్ మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న డీడబ్ల్యూవో లక్ష్మీరాజం

తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం సఖీ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డీడబ్ల్యూవో లక్ష్మీరాజం మాట్లాడుతూ విద్యార్థులు వారికి ఎదురైన సమస్యలను ధైర్యంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల దృష్టికి తీసుకరావాలని అన్నారు. ఫోక్సో చట్టం, టోల్‌ఫ్రీ నంబర్ 1098, 181 గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం బండి ఉపేందర్, సఖీ సెంటర్ సలహాదారు రోజా, ఉపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, తిరుపతి, గంగాభవాని, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌తో పనుల్లో వేగం



బద్దెనపల్లిలో తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లు అందిస్తున్న భారతీ సిమెంట్ ప్రతినిధులు

- ఆర్డర్ ఇచ్చిన గంటలో సిమెంట్ సరఫరా
- భారతి సిమెంట్ ఆర్.ఎం.నాగేశ్వర్‌రావు

సిరిసిల్ల: మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి సిమెంట్‌తో పనులు వేగంగా సాగుతాయని భారతి సిమెంట్ సంస్థ రీజినల్ మేనేజర్ నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలో కాలభైరవ ట్రేడర్స్‌లో తాపీ మేస్త్రీల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో తెలంగాణలో కొత్తగా విడుదల చేసిందన్నారు. స్లాబులు, పిల్లర్లకు, బ్రిడ్జీలకు, సిమెంట్‌రోడ్లకు భారతి సిమెంట్ ఎంతో సరైందని వివరించారు. అన్ని రకాల నిర్మాణాలకు భారతి సిమెంట్ బెస్ట్ ఎంపిక అని టెక్నికల్ ఇంజినీర్ సాగర్‌రెడ్డి పేర్కొన్నారు. నిర్మాణాలు జరిగే చోటికి భారతి సిమెంట్ ఇంజినీర్లు వస్తారని, సాంకేతిక సలహాలు ఇస్తారని వివరించారు. ఆర్డర్ చేసిన గంటలోనే సిమెంట్‌ను సరఫరా చేస్తున్నామని కంపెనీ సేల్స్ ఆఫీసర్ కె.రాజు తెలిపారు. 55 మంది తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ఉచిత ప్రమాద బీమా బాండ్లను అందించారు. కాలభైరవ ట్రేడర్స్ డీలర్ శ్రీనివాస్‌రెడ్డి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.



అడ్డుగా ఉన్నాయని కొట్టేశారు.. అడ్డంగా పడేశారు



వేములవాడలో పక్షం రోజులుగా సెస్ అధికారులు విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపునకు చర్యలు చేపట్టారు. తొలగించిన చెట్ల కొమ్మలను రోడ్డుపైనే ఉంచేయడంతో అటుగా వెళ్లే వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ అవి కనబడకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై పడేసిన చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని కోరుతున్నారు. - వేములవాడ/వేములవాడరూరల్



భూమికి పచ్చని రంగేసినట్టు..

భూమికి పచ్చాని రంగేసినట్టు.. పంటచేలు పండాలి ఓ అమ్మలాలో.. అని ఒక సినిమాలో పాట పాడినట్లు అనిపిస్తోంది ఈ చిత్రాన్ని చూస్తుంటే. తంగళ్లపల్లి మండలం తాడూర్ గ్రామశివారులోని మానేరు బ్యాక్ వాటర్ ప్రాంతంలో పంట పొలాలు పచ్చదనంతో పచ్చని వరి తివాచి పరుచుకుంది. - తంగళ్లపల్లి(సిరిసిల్ల)